

# గుప్పెడు గాలి

## బి.కె.ప్రసాద్

సింగిల్ పేజీ కథ

నా భర్త ఎటువంటి బలహీనతలు లేని మనిషని నేను అనను. నాకు తెలిసి కొన్ని ఉన్నాయి. అవంత పట్టించుకోవలసినవేం కావు. కొన్ని విషయాల్లో మాది ఎంత అన్యోన్య దాంపత్యమయినా నాకు అందదు. నా బుర్ర పాడు చేసుకోవడం ఇష్టంలేక పట్టించుకోవడం మానేశాను. అయితే,

ఆయన సెల్‌ఫోను కొన్న దగ్గర నుండి నాకు తలనొప్పి మొదలయి ఎక్కువ కావడం మొదలెట్టింది. అది లేకమునుపు ఆఫీసు నుండి రాగానే నేను అందించిన కాఫీ తీసుకుని మాఇంటి బాల్కనీలో కూర్చుని ఆరోజు జరిగిన సంగతులు ముచ్చటించుకునేవాళ్లం. ఉదయం నుండి ఇంటిపనులు చేసి విసుగు పుట్టిన నాకు ఆయన మాటలు సేద చేకూర్చేవి. ఆయన మాటకారి. బాగా లేకపోయిన మనసును చాకచక్యంగా మార్చగలడు. నాకు ఆయనలో నచ్చని విషయం పరాయి ఆడవాళ్లంటే ఆసక్తి చూపడం. కొత్తా, పాత ఏముండదు. చాలాసేపు మాట్లాడుతుంటాడు. అవసరం లేకపోయినా, అడగకపోయినా ఏదో సహాయం చేస్తుంటాడు. బాధ అనిపించినా నేను ఎప్పుడూ బయట పడలేదు. సర్దుకుపోతుంటాను.

మా ఇంట్లో అన్ని సదుపాయాలున్న లేండ్‌లైన్ ఉంది. దాన్ని ఉపయోగించడం నాకు బాగా తెలుసు. సెల్‌ఫోనులో మాటలు వినడం, మాట్లాడడం, చార్జి చేయడం తప్ప మిగిలిన విషయాల్లో దాన్ని ఎలా ఉపయోగిస్తారో నాకు తెలియదు. నాలుగయిదుసార్లు వివరించాడు. వింటున్నప్పుడు ఆయన చెప్పేది అర్థం అయినట్టే ఉంటుంది. ప్రయత్నం చేశాను కాని నా వల్ల కాలేదు. మా పిల్లలు మటుకు దాని ఉపయోగం అవలీలగా తెలుసుకున్నారు. తనకు ఇష్టంలేని వాళ్ల నుండి ఫోను వస్తే ఇంట్లో లేడని నా చేత అబద్ధం చెప్పిస్తాడు. ఇష్టమయినవాళ్ల దగ్గర నుండి వస్తే బాల్కనీలో ఒక మూలగా కుర్చీ వేసుకుని చాలాసేపు మాట్లాడతాడు. మాట్లాడేది ఆడవాళ్లతోనో, మగవాళ్లతోనో నాకు అర్థం అయ్యేది కాదు. ఆఫీసు విషయాల్లా నాకు అనిపించేవి కావు. ఎవరితో మాట్లాడుతున్నావని నేను ఎప్పుడూ అడగలేదు. అడగకుండా చెప్తాడని అనుకున్నాను కాని చెప్పలేదు.

మా పెళ్లి అయి పది సంవత్సరాలు దాటాయి. మా మధ్య పూర్తి అవగాహన లేదని కాదు. అడపా దడపా పొరపొచ్చలు వచ్చినా సర్దుకుపోతుంటాం. దరిమిలా ఆయన నాకు దూరమవుతున్నట్టు అనిపిస్తోంది. ఇదివరకు పటిలా నాతో ఎక్కువ సమయం గడపడం లేదు. ఇంటికి ఆలస్యంగా రావడం మొదలయింది. సామాన్యంగా నా సమస్యలు మరీ ముఖ్యంగా, కుటుంబ సమస్యలు నేనే పరిష్కరించుకుంటాను. అమ్మకు కాని, నాన్నకు కాని ఎంత దగ్గరవాళ్లతోనయినా చెప్పను. గట్టిగా ఆయన్ని అడిగి ఇబ్బంది పెట్టడం ఇష్టంలేదు. రోజులు గడుస్తున్నకొద్దీ బాధ పేరుకుపోతోంది.

చివరకు ఒకరోజు ఆయన చొక్కా ఉతకడానికి వేయబోతూ జేబులో ఏమీ లేవు కదా అని పరీక్షగా చూస్తే నాలుగు మడతలు పెట్టిన చిన్న కాయితం కనిపించింది. దానిమీద నెంబరు కనిపించింది. పేరేమీ లేదు. సెల్ నెంబరు కాదు. అది లేండ్‌లైన్ నెంబరు. ఎవరి పేరున ఆ నెంబరు ఉందో తెలుసుకోవడం కష్టం కాదు. ఎంక్వయిరీకి ఫోను చేసి ఆ నెంబరు ఎవరి పేరున ఉందో, చిరునామా చెప్పగలరా అని అడిగాను. "రెండు నిమిషాలు ఆగండి. చెప్తాను" అందామె. నిమిషం కాకముందే అడిగింది, "మీరు చెప్పిన నెంబరు కరక్టే కదూ?"

"కరక్టేనండి" అని మళ్లీ నెంబరు చెప్పాను.

"నెంబరు ఉంది కాని అది ఎవరి పేరున ఉందో చిరునామా ఏవీ నమోదు కాలేదు".

"అదెలా?"

"అత్యవసరంగా నెట్ కనెక్షన్ తీసుకోడానికి, మరికొన్ని సమయాల్లో నమోదు చేయడం మర్చిపోతుంటారు. లేదూ ఆలస్యం అవుతుంటుంది"

"తెలుసుకోడానికి వేరే దారి లేదా?"

"మా ఎగ్జిక్యూటివ్‌ను కనుక్కుని చెప్తాను. లయిన్లో ఉండండి".

అర నిమిషం తర్వాత ఆమే అంది, "అడిగాను. ఆయనకూ తెలియదట..." నేనేదో అడగబోతోంటే ఫోను పెట్టేసింది. నిరుత్సాహం వేసింది. నా మొదటి ప్రయత్నం విఫలమయింది.

కొద్దిసేపయ్యాక సరాసరి ఆ నెంబరుకే ఫోను చేస్తేనో అనిపించింది. 'మీరెవరు, ఎవరు కావాలి, ఎందుకు?' ఇలా ప్రశ్నలు ఎదురయితే నా దగ్గర జవాబులు లేవు. అబద్ధాలు ఆడనని కాదు. హఠాత్తుగా తట్టవు. అవతలివాళ్ల దగ్గర కాలర్ అయిడెంటిటీ ఉంటే ఇబ్బందిలో పడే అవకాశం ఉంది. ఏది ఏమయితే అవుతుందనుకుని కాయితం మీదున్న నెంబరుకు ఫోను చేశాను. ఎంగేజ్డ్. అయిదు నిమిషాలాగి చేశాను. ఎంగేజ్డ్. అరగంట ఆగి చేశాను. ఎంగేజ్డ్. ఇంతసేపూ మా ఆయనతో మాట్లాడుతుందా? నాకు దుఃఖం వస్తోంది. తెలుసుకుందామని పట్టుదల ఎక్కువవుతోంది. ఆయన సెల్ నెంబరుకు ఫోను చేశాను. అదీ ఎంగేజ్డ్. నన్ను నేను నిగ్రహించుకోలేకపోయాను. ఏడ్చేశాను.

సాయంత్రం ఆయన ఆఫీసు నుండి వచ్చీ రాగానే కాయితం చూపించి, "ఈ ఫోను నెంబరు ఎవరిది?" నెమ్మదిగా అడిగాను.

నవ్వి, "ఈ కాయితం ఎక్కడ దొరికింది?" అడిగాడు.

"మీ జేబులో".

"నా జేబులు ఎప్పటినుండి వెతకడం మొదలెట్టావు?" మళ్లీ నవ్వాడు.

నా మాటలు నవ్వులాటగా ఉన్నాయనుకుంటాను. నా చేయి అందుకుని తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు.

"చొక్కా ఉతకడానికి వేయబోతూ చూస్తే దొరికింది. ఈ నెంబరు ఎవరిదో తెలుసుకుందామని చాలాసార్లు ప్రయత్నించాను. ఎంగేజ్డ్ వస్తోంది..."

"మనింటి ఫోను నెంబరు మనమే చేస్తే ఎంగేజ్డ్ కాక మరేం వస్తుంది? చాలామందికి బయటివాళ్ల ఫోను నెంబర్లు, సెల్‌నెంబర్లు గుర్తుంటాయి కాని వాళ్ల నెంబర్లు వాళ్లకే గుర్తుండవు" అన్నాడు.

గుండె మీంచి బరువు తీసేసినట్టు మనసు తేలికయింది. ఉదయం నుండి మథనపడినందుకు నొచ్చుకున్నాను. కాని, నా సమస్య అలాగే మిగిలిపోయింది. సెల్‌లో అంతసేపు ఎవరితో మాట్లాడుతుంటాడు?